పార్లమెంట్ ఎన్నికలో లబ్ధికి మళ్లీ బోగస్ హామీలు

ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న వర్స కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే మళ్లీ సీఎం రేవంత్‌రెడ్డి బోగస్ హామీలు ఇస్తున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణ హరి విమర్శించారు. మంగళవారం ఎల్లారెడ్డిపేటలో జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావుతో కలిసి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. డిసెంబర్ 9న రుణమాఫీ ఉంటుందని మాట తప్పి ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామని, వచ్చే పంట కాలానికి క్వింటాలుకు రూ.5 వందలు బోనస్ ఇస్తామని మరోమారు అబద్ధాలు చెప్పి ఎన్నికల్లో గట్టెక్కేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది ప్రజలు నమ్మరని విమర్శించారు. జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు రైతులు, ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. ఇక్కడ ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాశ్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, నిమ్మల బాబు, పిల్లి కిషన్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, నిర్మాణ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ, వేసవి కాలం పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరి కోతలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంట వెంటనే డబ్బులు రైతుల ఖాతాలో జమయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, జడ్పీటీసీలు కత్తెరపాక ఉమ, మ్యాకల రవి, గుగులోతు కళావతి, చీటి లక్ష్మణ్‌రావు, నాగం కుమార్, గుండం నర్సయ్య, కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, జడ్పీ సీఈవో ఉమారాణి, అధికారులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలి

- కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలి
- వినోదన్న గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం

ముస్తాబాద్, ఏప్రిల్ 16 : కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బోయినిపల్లి వినోద్ కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్తా సైనికుడిగా పనిచేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని ఎంపీపీ జనగామ శరత్‌రావు స్వగృహంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా అధ్యక్షుడు ఆగయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకుని వచ్చేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గత పదేళ్లు పేదల సంక్షేమానికి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరచేతిలో వైకుంఠం చూపి గద్దెనెక్కిన కాంగ్రెస్ 420 పథకాలు, కరంటు కోతలు, సాగునీరు లేక ఎండిన పంట పొలాలు, రైతుకు మద్దతు ధర, రూ.500 బోనస్, రుణమాఫీ, కాంగ్రెస్ పాలనలో ఆగమైన రైతు బతుకులపై గడపగడపకూ వెళ్లి వివరించాలని సూచించారు. కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలని, వినోదన్న గెలిపే లక్ష్యంగా కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు, సీనియర్ నాయకులు కల్వకుంట్ల గోపాల్ రావు, విజయ రామారావు, యాది మల్లేశ్ యాదవ్, సర్వర్ పాషా, చీటి నర్సింగ రావు, నర్సింహా రెడ్డి, బత్తుల అంజయ్య, చెవుల మల్లేశ్ యాదవ్, గాడిచెర్ల దేవయ్య, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు దబ్బెడ రేణుక, మనోహర్, నవాజ్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా సత్తా చాటాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా సత్తా చాటాలని, ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు తంగళ్లపల్లి మండల కేంద్రంలోనీ బీఆర్ఎస్ కార్యాలయంలో మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, నేతలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల మనస్సు గెలుచుకుని మరోసారి అధికారంలోకి వస్తామని, అప్పటివరకు పార్టీ బలోపేతం, మన అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలన్నారు. కార్యకర్తలు, నేతలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ అధిష్ఠానం, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టి తీసుకెళ్తామన్నారు. బూత్ స్థాయిలో గడపగడపకూ తిరిగిఓట్లను అభ్యర్థించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పడిగెల మానస, సింగిల్ విండో చైర్మన్లు బండి దేవదాస్ గౌడ్, కోడూరి భాస్కర్ గౌడ్, మాట్ల మధు, వేణుగోపాలరావు, పడిగెల రాజు, పూసపల్లి సరస్వతి, ప్యాక్స్ వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, అవునూరి వెంకటరాములు, కందుకూరి రామా గౌడ్, అంకారపు రవీందర్, కొమురయ్య, నర్సయ్య, అనిల్‌రెడ్డి, క్యారం జగత్, దేవేందర్, కృష్ణ, అబూబకర్, ఓంకార్ శ్రీనివాస్, బండి జగన్, మోహన్‌రెడ్డి, ఉమరాజు, బైరి రమేశ్, కుర్మరాజయ్య, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరా పనుల నిలిపివేత

నమస్తే ఎఫెక్ట్

బోయినపల్లి, ఏప్రిల్ 16: బూర్గుపల్లి గ్రానైట్ క్వారీకి విద్యుత్ సరఫరా కోసం చేస్తున్న పనులను మండల పరిషత్ అధికారులు నిలిపివేశారు. బూర్గుపల్లి గ్రానైట్ క్వారీకి విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ పనులకు గ్రామ పంచాయతీ ఎన్‌వోసీ లేదని, రహదారి పక్కన చెట్లున్నాయని అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా పనులు చేయొద్దని, పంచాయతీ రాజ్ యాక్టు ప్రకారం చెట్లు కొట్టవద్దని సెస్ ఏఈకి కోరెం జీపీ కార్యదర్శి రవి ఫిబ్రవరిలో నోటీస్ ఇచ్చారు. కానీ సెస్ అధికారులు అక్రమంగా ఆదివారం సెలవు రోజున రహదారి పక్కన ఉన్న ఆకు పచ్చని చెట్లను కొట్టివేశారు. ఈ విషయమై మంగళవారం నమస్తేలో 'తెలంగాణలో ఆకు పచ్చని చెట్లపై గొడ్డలి వేటు' అనే శీర్షికన కథనం రాగా మండల పరిషత్ ఎంపీడీవో జయశీల స్పందించి వెంటనే కోరెం కార్యదర్శిని పిలిచి మాట్లాడి వివరాలు తీసుకున్నారు. అందుకు ఆయన గత నెలలో సెస్ ఏఈకి నోటీస్ ఇచ్చినట్లు చెప్పారు. మరోసారి సెస్ అధికారులకు నోటీస్ ఇచ్చినా కొట్టిన చెట్ల విషయంలో ప్రభుత్వ నిబంధనలు పంచాయతీ రాజ్ యాక్టు ప్రకారం జరిమానా వేయనున్నట్లు ఎంపీడీవో జయశీల పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు నిలిపివేసినట్లు చెప్పారు. నోటీస్ ఇచ్చినప్పటికీ సెలవు రోజున పనులు చేయడంపై నోటీస్‌ను దిక్కరించినట్లు అవుతుందని ఆమె తెలిపారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్

- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి
- 40 వాహనాల సీజ్

బొల్లారంలో తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 17: నేరాల నియంత్రణకే కమ్యూటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలనుసారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ, ప్రజల రక్షణ గురించి ప్రజల్లో భద్రత కల్పించడంపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందన్నారు. మాదక ద్రవ్యాలను గంజాయి వంటి మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలను నివృత్తి చేసే జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించాని తెలిపారు. ఎలాంటి పేపర్లు, సరైన నంబర్ ప్లేట్లు లేని 40 ద్విచక్రవాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పందంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

21న క్రీడాకారుల ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 32న జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో 3వ తెలంగాణ మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ రన్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 మెన్ అండ్ ఉమెన్ ఏజ్ గ్రూపులకు ఎంపిక పోటీలు ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ చాటిన వారిలో 25 మందిని సూర్యపేటలో జరిగే స్టేట్ మీట్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తోపాటు మెరిట్ సాధించిన వారికి విభాగాల వారీగా మెడల్స్ అందిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకరులు తహసీల్దార్ జారీ చేసిన డేట్ ఆఫ్ బర్త్, పదో తరగతి సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 7901454456, 9441456385లో సంప్రదించాలని సూచించారు.

వినోద్‌కుమార్‌ను గెలిపించుకుందాం

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి పనిచేసిన వినోద్‌కుమార్ 2014లో ఎంపీగా విజయం సాధించి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ సాధించిన ఘనత ఆయనకు దక్కుతుందని కొనియాడారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌తోపాటు నాలుగు జాతీయ రహదారులు సాధించారన్నారు. కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ మంజూరు చేయించి, 50 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయిస్తే ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ నిర్లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కళాశాలను ఇతర రాష్ట్రాలకు తరలించిందన్నారు. బండి సంజయ్ తన పార్లమెంట్ పరిధిలో ఒక్క గుడి కట్టలేదని, ఒక్క నవోదయ పాఠశాల మంజూరు చేయించలేదని విమర్శించారు. బండికి నిజంగానే యువకులు, విద్యార్థులపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రం నుంచి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఐదు రూపాయలు తేని బండి ఏ అర్హతతో ప్రజలను ఓట్లు అడుగుతున్నాడో చెప్పాలన్నారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన బండి సంజయ్ మళ్లీ ఇప్పుడు ఎంపీగా పోటీ చేస్తున్నాడన్నారు. అభివృద్ధిని ప్రోత్సహించే నాయకుడిని ఎన్నుకుందామా లేక విద్వేషాలు రెచ్చగొట్టే వారిని ఎన్నుకుందామో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల పాలనలోనే రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు తెచ్చిందో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలెవరూ లేరన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు మట్టె శ్రీనివాస్, నవీన్, వెంకటేశ్, అరవింద్, హర్షిత్, రామ్‌చరణ్, సుజిత్, వంశీ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడు తిట్టాడని అన్న ఆత్మహత్య

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16 : ఆస్తి విషయంలో తమ్ముడు తిట్టాడని మనస్తాపానికి గురైన అన్న మంగళవారం పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాజు గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్‌పేట పంచాయతీ పరిధిలోని ఎర్రనర్సుపల్లి గ్రామానికి చెందిన కంకటి స్వామి (45) నూతన ఇల్లు నిర్మించుకుని కిరాణం నిర్వహించుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటి నిర్మాణానికి అప్పుకాగా తనకు ఉన్న మూడెకరాల భూమిని అమ్ముకుని అప్పులు తీర్చాలనుకుని భూమి అమ్మకానికి పెట్టాడు. కాగా తమ్ముడైన కంకటి ప్రభాకర్ భూమిని అమ్మకుండా అడ్డుపడ్డాడు. నూతన ఇల్లు అమ్మకానికి పెట్టగా అది కూడా తన తమ్ముడు తనకు తెలియకుండా బ్యాంకు లోను పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, దీనిపై గ్రామ పెద్దలతో రెండ్రోజుల క్రితం పంచాయితీ నిర్వహించారు. ఆ భూమి నాదే, ఇల్లు కూడా నాదే, ఇల్లుపై తీసుకున్న లోను కూడా కట్టనని తిట్టాడని, దీంతో మనస్థాపానికి గురైన స్వామి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. స్వామి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్లాట్స్ ఇస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

వేములవాడ, ఏప్రిల్ 16: హైదరాబాద్, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్స్ తక్కువ ధరకి ఇప్పిస్తానని అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి వారికి రిజిస్ట్రేషన్ చేయకుండా బెదిరింపులకు పాల్పడిన మెరుగు బాబును కోనరావుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం ఒక ప్రకటనలతో తెలిపారు. హైదరాబాద్, గజ్వేల్ ప్రాంతాల్లో తక్కువ ధరకే ఓపెన్ ప్లాట్స్ ఇప్పిస్తానని ఉద్దేశపూర్వకంగా అమాయకుల దగ్గర డబ్బులు వసూలు చేసి ఏ విధమైన రిజిస్ట్రేషన్ చేయకుండా, తిరిగి డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. అంతేకాకుండా వారిపై దాడికి ప్రయత్నించడంతో కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన సాసాల పద్మ, రామన్నపేట గ్రామానికి చెందిన చెర్ల బూదవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు సదరు నేరాలకు పాల్పడుతున్న కొలనూర్ గ్రామానికి చెందిన మెరుగు బాబును అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాలను ఒప్పుకున్నట్లు తెలిపారు. అలాగే, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తుల నుంచి కూడా ప్లాట్స్ ఇప్పిస్తానని, తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని నమ్మించి వారి దగ్గర నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేశాడని తెలిపారు. రకరకాల కారణాలతో రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి చేయకపోవడంతో పాటుగా బలవంతంగా డబ్బులు వసూలు చేస్తే చంపివేస్తానని బెదిరించేవాడినని ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

నేడు రాజన్న సన్నిధిలో రాములోరి తలువాలు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమిని పురస్కరించుకుని వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి సన్నిధిలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని ఆలయ అధికారులు, అర్చకులు కనుల పండువగా నిర్వహించనున్నారు. ఎములాడలో జరిగే సీతారాముల కల్యాణాన్ని భక్తులు 'తలువాలు'గా పేర్కొంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2 లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. బుధవారం ఉదయం 11గంటల 55 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహిస్తారని తెలిపారు. దాదాపు 150 మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లలో ఉంటారని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఉగాది నుంచి నిర్వహిస్తున్న శ్రీరామవనమి నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శ్రీ రాజరాజేశ్వరస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్రస్వామివారి ఆలయం లో పంచోపనిషత్తుల ద్వారా అభిషేకపూజలు నిర్వహించారు.

గంభీరావుపేట, ఏప్రిల్ 16: గంభీరావుపేటలోని ప్రాచీన ఆలయమైన శ్రీ సీతారామాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శ్రీరామ నవమి రోజున స్వామి వారి కల్యాణం మొదలుకుని 9 రోజుల పాటు ఉత్సవాలువాలు కన్నుల పండువగా నిర్వహిస్తారు. పంచ లోహలతో చెక్కబడిన ఉత్సవమూర్తులను బ్రహ్మోత్సవాల్లో వివిధ వాహనాలపై గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వేములవాడ టౌన్: సీతారాముల కల్యాణానికి సిద్ధమైన వేదిక

కోనరావుపేట, ఏప్రిల్ 16 : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన మామిడిపల్లి శ్రీసీతారామ స్వామి ఆలయం రాములవారి కల్యాణానికి సిద్ధమైంది.

అనారోగ్యంతో ఒకరు..

ముస్తాబాద్, ఏప్రిల్ 16 : మండలంలోని గూడెం గ్రామానికి చెందిన నిరుపేద బొప్ప బాలయ్య (58) అనార్యోంతో బాధపడుతూ జీవితంపై విరక్తితో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలయ్య కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేవని బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. బాలయ్యకు భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలున్నారు. బాలయ్య అన్న కొడుకు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

కోనరావుపేట : ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోనరావుపేట, ఏప్రిల్ 16: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశానుసారం స్వీప్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళలకు రంగోలీ పోటీలను నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

ముస్తాబాద్ ఏప్రిల్ 16 : మండల కేంద్రంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై మహిళా గ్రూప్ సభ్యులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శుభోదయం కేంద్రంలో మహిళలకు ఓటు హక్కు బాధ్యతపై వివరించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అర్హులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించేందుకు స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం దేవరాజు వివరించారు. అనంతరం అందరూ కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వీప్, ఏపీఎం, మహిళా సమాఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16 : గంజాయి కేసులో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎస్ఐ రాజుగౌడ్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మండల కేంద్రంలో సమాచారంతో వాహనాలను తనిఖీ చేస్తుండగా కరీంనగర్‌కు చెందిన కృష్ణం రాజు భరత్ (24), బిహార్ రాష్ట్రానికి చెందిన ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసముంటున్న భూపేంద్ర కుమార్ (22) బైక్‌పై 130 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా పట్టుకుని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. సీఐ సదన్ కుమార్ ఆదేశాల మేరకు ఇద్దరిని రిమాండ్‌కు తరలించి, బైక్‌ను సీజ్ చేశామని తెలిపారు. గంజాయి పట్టుకున్న పోలీస్ సిబ్బందిని సీఐ సదన్‌కుమార్ అభినందించారు.

'బీజేపీవి దొంగ దీక్షలు'

ముస్తాబాద్, ఏప్రిల్ 16 : బీజేపీ నాయకులవి దొంగ మాటలు దొంగ దీక్షలని జడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తీసుకొచ్చి వందలాది మంది రైతులను పొట్టన పెట్టున్నది బీజేపీ అని, వారు దీక్షలు చే యడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా తీసుకురాని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈరోజు రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తున్నారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, పాక్స్ డైరెక్టర్ కొండల్‌రెడ్డి, నర్సింలు తదితరులున్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్
- వీర్నపల్లి, భూక్యాతండాల్లో కొనుగోలు కేంద్రాల పరిశీలన



వీర్నపల్లి : రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్

వీర్నపల్లి, ఏప్రిల్ 16: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంతోపాటు భూక్యాతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించి, రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటవెంటనే మిల్లులకు పంపాలని సూచించారు. వేసవి దృష్ట్యా రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఉమారాణి, నాయబ్ తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, ఆర్ఐ ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

కొనుగ